# ఉంగరాల మోజులో నాణేల ధ్వంసం

## రాజన్న సిరిసిల్లలో పోలీసుల నిఘా కరువు



ఇది కద నిజం :ఇటీవల యువతలో ఉంగరాలపై పెరుగుతున్న ఆసక్తి కారణంగా పదిరూపాయల నాణేలను ధ్వంసం చేసే ఘటనలు పెరుగుతున్నాయి. నాణేలను ఉద్దేశపూర్వకంగా కరిగించడం, కట్ చేయడం లేదా వక్రీకరించడం చట్టపరంగా నేరం అయినప్పటికీ, కొంతమంది వాటితో ఉంగరాలు తయారు చేసుకుంటున్నారు.

సోషల్ మీడియా ప్రభావంతో ఈ ట్రెండ్ మరింత విస్తరిస్తోంది. వీడియోలు, పోస్టులను చూసి కొంతమంది యువకులు కూడా నాణేలను ధ్వంసం చేసి అలంకార వస్తువులుగా మార్చించుకుంటున్నారు. దీనివల్ల చట్ట విరుద్ధ చర్యలు పెరుగుతున్నాయని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇటీవల ఈ తరహా ఘటనలు ఎక్కువవుతున్నాయని సమాచారం. ఈ నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మేధావులు, ప్రజలు కోరుతున్నారు. నాణేలను ధ్వంసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఈ అక్రమాలకు చెక్ పడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. నిపుణుల ప్రకారం, భారతీయ నాణేలను ధ్వంసం చేయడం Coinage Act ప్రకారం శిక్షార్హమైన నేరం. నాణేలను కరిగించడం లేదా వేరే రూపంలో మార్చడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ, నాణేలను చట్టబద్ధంగా ఉపయోగించాలని సూచిస్తున్నారు.

# వేములవాడలో వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణోత్సవం

## భక్తిపారవశ్యంలో రాజన్న క్షేత్రం



ఇది కద నిజం :రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. లోక కళ్యాణం కోసం జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కళ్లారా చూసేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ వేడుకల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ మరియు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న మంత్రి మరియు ప్రజాప్రతినిధులకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. కల్యాణోత్సవంలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు మరియు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా జరిగిన ఈ క్రతువులో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు అతిథులకు వేద ఆశీర్వచనాలు అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు ప్రముఖులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీరామనవమి సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు మరియు పోలీసులు పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లను క్రమబద్ధీకరించడంతో పాటు, తాగునీరు మరియు ఇతర మౌలిక వసతులను కల్పించారు. ఆలయ పరిసరాల్లో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

# గోవూర్‌లో అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణోత్సవం



ఇది కద నిజం: నిజామాబాద్ జిల్లా మోస్ర మండలం గోవూర్ గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామ సర్పంచ్ లోకినేని హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీరామచంద్రునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక ర్యాలీ భక్తుల సందడితో కోలాహలంగా సాగింది. శ్రీరామ నామస్మరణలు, భక్తుల ఆటపాటలు, జై శ్రీరామ్ నినాదాలతో గోవూర్ గ్రామం మొత్తం మారుమోగిపోయింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కల్యాణ ఘట్టాన్ని భక్తులు కళ్లారా వీక్షించి తరించారు. ఈ ఉత్సవాల్లో గ్రామ ప్రముఖులు, యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడంతో వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

# గౌరారంలో భక్తిశ్రద్ధలతో శ్రీ సీతారాముల కల్యాణోత్సవం




ఇది కద నిజం, కామారెడ్డి జిల్లా: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని గౌరారం గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత అంగరంగ వైభవంగా జరిగాయి. లోక కల్యాణార్థం నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ లోకినేని హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా, గ్రామంలో భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల ఆటపాటలు, శ్రీరామ నామస్మరణలు మరియు జైశ్రీరామ్ నినాదాలతో గౌరారం గ్రామం మొత్తం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. సీతారాముల కల్యాణ ఘట్టాన్ని వీక్షించేందుకు గ్రామస్తులు మరియు పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సందడి, కోలాటాలు, ఆధ్యాత్మిక నినాదాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, యువకులు మరియు మహిళలు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను దిగ్విజయం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

# నిజాంసాగర్ నుంచి సాగునీటి విడుదల

## 1200 క్యూసెక్స్‌తో ఐదో విడత నీటి సరఫరా

ఇది కద నిజం ,నిజాంసాగర్: సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఐదో విడత నీటి విడుదలను నీటిపారుదల శాఖ అధికారులు ప్రారంభించారు. 2026, మార్చి 27 శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి ప్రధాన కాలువ ద్వారా 1200 క్యూసెక్స్ నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న నీటి లభ్యతను బట్టి, సాగు భూములకు తగినంత నీరు అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కాలువ పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు, రైతులు మరియు పశుపాలకులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. కాలువలోకి ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున, ఎవరూ కాలువలోకి దిగవద్దని, పశువులను కాలువ ఒడ్డుకు తీసుకెళ్లవద్దని సూచించారు. ప్రమాదాలు జరగకుండా ప్రజలందరూ భద్రతా నియమాలను పాటిస్తూ సహకరించాలని నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిపారుదల శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.



# హనుమాన్ సేవ స్వాముల సన్నిధాన ఆలయ నిర్మాణానికి భూమి పూజ, జెండా ఆవిష్కరణ



ఇది కద నిజం ,పిట్లం: శ్రీరామనవమి సందర్భంగా పిట్లం మండల పరిధిలోని నాగంపల్లి గ్రామానికి వెళ్లే రహదారి పక్కన గల ప్రభుత్వ స్థలంలో హనుమాన్ సేవ స్వాముల సన్నిధాన ఆలయ నిర్మాణం కోసం భూమి పూజతో పాటు జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని హనుమాన్ దీక్ష స్వాములు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిట్లం మండలానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలు, యువజన నాయకులు, హనుమాన్ దీక్ష స్వాములు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా దీక్ష స్వాములు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పిట్లం మండలంలో హనుమాన్ దీక్షలు కొనసాగుతున్నప్పటికీ, ప్రత్యేకంగా సన్నిధానం లేకపోవడంతో ఇతర ఆలయాలను ఆశ్రయించి కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తోందని తెలిపారు. భవిష్యత్తులో హనుమాన్ దీక్ష స్వాములకు అన్ని వసతులతో కూడిన సన్నిధానం ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఈ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అందరూ సహకరించి ఈ సన్నిధానాన్ని అభివృద్ధి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దీక్ష గురుస్వామి రాంచందర్, స్వాములు గాండ్ల రాము, గాండ్ల శ్రీను, కృష్ణ వంశీ, లక్ష్మణ్, అశోక్, రవి, చెవుల పవన్, వ్యాపారవేత్తలు గంగ ప్రవీణ్, ఉప్పు విట్టల్, కోట పుండరీకం, అశోక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పుపాలగూడలో శ్రీరామనవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహణ



ఇది కద నిజం ,హైదరాబాద్: శ్రీరామనవమి సందర్భంగా పుపాలగూడలోని బిగోనియా హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో శ్రీరామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తి గ్రూప్ అసోసియేషన్ సభ్యులు మరియు అపార్ట్‌మెంట్ నివాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కళ్యాణాన్ని వీక్షించి ఆశీస్సులు పొందారు. వేడుకల సందర్భంగా భక్తి వాతావరణం నెలకొని, ఆ ప్రాంతం అంతా ఆధ్యాత్మికంగా మంత్రముగ్ధమైంది.

# " రాక్‌వుడ్స్‌లో శ్రీరామనవమి వేడుకలు"



ఇది కద నిజం ,బిబినగర్, మార్చి 27, 2026: రాక్‌వుడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్, బిబినగర్‌లో శ్రీరామనవమి పర్వదినాన్ని భక్తి, ఉత్సాహం మరియు సాంస్కృతిక వైభవంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించడంతో పాటు శ్రీరాముడి జీవితం, గుణగణాలను పరిచయం చేసి ప్రేరణ కలిగించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. వేడుకలు భక్తిగీతాలతో ప్రారంభమై, అనంతరం విద్యార్థులు రామాయణంలోని ముఖ్య ఘట్టాలను ఆవిష్కరించే సాంస్కృతిక కార్యక్రమాలను అద్భుతంగా ప్రదర్శించారు. అదనంగా, విద్యార్థుల జ్ఞానాన్ని పెంపొందించే ఉద్దేశంతో ఇంటర్-హౌస్ క్విజ్ పోటీ కూడా నిర్వహించబడింది. పాఠశాల ఆవరణ అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోగా, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీ రామన్ నాయుడు సభను ఉద్దేశించి మాట్లాడుతూ, నీతి, క్రమశిక్షణ మరియు నిజాయితీ జీవితంలో ఎంత ముఖ్యమో వివరించారు. శ్రీరాముడు చూపిన ధర్మ మార్గాన్ని అనుసరించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. సీఈఓ సుబ్రహ్మణ్యం ఆధునిక సమాజంలో శ్రీరాముడి ఆలోచనల ప్రాసంగికతను వివరించి, నిజాయితీ, గౌరవం, పట్టుదల వంటి విలువలను అలవర్చుకుంటే విజయాన్ని సాధించవచ్చని తెలిపారు. ప్రిన్సిపాల్ శ్రీరంజని విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మకంగా మాట్లాడుతూ, శ్రీరాముడి వ్యక్తిత్వం సహనం, ధైర్యం, కట్టుబాటు వంటి గుణాలను నేర్పుతుందని తెలిపారు. ఈ విలువలను దైనందిన జీవితంలో అమలు చేసి బాధ్యతగల మరియు విజయవంతమైన వ్యక్తులుగా ఎదగాలని సూచించారు. ఈ వేడుకలు భక్తి వాతావరణంలో ముగిసినందున విద్యార్థులు సాంస్కృతిక విలువలతో పాటు శ్రీరామనవమి ప్రాముఖ్యతను మరింతగా అవగాహన చేసుకున్నారు.

# వైభవంగా 25వ సీతారాముల తిరు కల్యాణం

## సిల్వర్ జూబ్లీ వేడుకల్లో మానవత్వం చాటుకున్న ఆలయ కమిటీ



ఇది కద నిజం: శ్రీరామనవమి పురస్కరించుకుని 25వ సీతారామచంద్రస్వామి తిరు కల్యాణ మహోత్సవ రజతోత్సవ వేడుకలను (సిల్వర్ జూబ్లీ) అత్యంత భక్తిశ్రద్ధలతో, వినూత్నంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో భాగంగా నిర్వాహకులు మానవత్వాన్ని చాటుకున్నారు. సమాజంలో వెనుకబడిన, ప్రత్యేక అవసరాలు కలిగిన దృష్టి లోపం ఉన్నవారు, మూగ, చెవిటి వారు, శారీరక వికలాంగులు, వృద్ధులు మరియు ప్రభుత్వ హాస్టల్స్‌లోని దివ్యాంగులను ఈ కల్యాణ మహోత్సవానికి ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారికి స్వామివారి కల్యాణాన్ని వీక్షించే అవకాశం కల్పించడమే కాకుండా, ప్రత్యేకంగా భోజన వసతి కల్పించి గౌరవించారు. అనంతరం స్వామివారి ఆశీర్వాదాలను, ప్రసాదాలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మిద్దెల చంద్రశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ ముగ్గుంటి సుశీల్ కుమార్ చారి, మరియు కోశాధికారి గుండు శ్రీకాంత్ పాల్గొని, సేవా దృక్పథంతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. భక్తికి సేవను జోడించి నిర్వహించిన ఈ రజతోత్సవ వేడుకలు స్థానికంగా అందరి ప్రశంసలు అందుకున్నాయి.

# గోవూర్‌లో ఉత్సాహంగా శ్రీరామనవమి కుస్తీ పోటీలు

## మల్లయోధుల పోటాపోటీ పోరాటాలు!



ఇది కద నిజం ,మోస్ర (గోవూర్): నిజామాబాద్ జిల్లా మోస్ర మండలం గోవూర్ గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా, గ్రామీణ క్రీడా వైభవానికి వేదికయ్యాయి. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామ సర్పంచ్ కత్తే రవి, గ్రామ పెద్దలు మరియు గ్రామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీలు అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామీణ సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ఈ మల్లయుద్ధం పోటీలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కుస్తీ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన మల్లయోధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అఖేడాలో మల్లయోధులు తమ భుజబలాన్ని ప్రదర్శిస్తూ, ఎత్తుకు పైఎత్తులు వేస్తూ సాగించిన పోరాటాలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేశాయి. ప్రతి కుస్తీలోనూ మల్లయోధులు పట్టువదలని విక్రమార్కుల్లా తలపడటంతో మైదానం మొత్తం ఈలలు, కేకలతో మారుమోగిపోయింది. గెలుపు కోసం యోధులు ప్రదర్శించిన పట్టుదల, క్రీడా స్ఫూర్తి గ్రామీణ క్రీడల ప్రాముఖ్యతను చాటిచెప్పాయి. ఈ వేడుకను వీక్షించేందుకు గోవూర్ గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి యువకులు, పెద్దలు భారీగా తరలివచ్చారు. పండుగ వాతావరణంలో జరిగిన ఈ పోటీలు శ్రీరామనవమి వేడుకలకు మరింత శోభను చేకూర్చాయి. గ్రామ సర్పంచ్ మరియు కమిటీ సభ్యులు విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడంలో గోవూర్ గ్రామం ప్రదర్శించిన ఉత్సాహంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

